

# లాంగ్ హై జంప్

పాపారావు సన్నకారు ప్రభుత్వోద్యోగి. పొట్టికాళ్లు, పొడగాటి చేతుల్తో పొలంలో దిష్టిబొమ్మలాగుంటాడు. వయసు మూడు పదులు దాటింది. ఒక ముద్దుల పెళ్ళాం, ఇద్దరు పిల్లలున్నా కలహాలు, కలతలూ లేని కమ్మనైన కాపురం అతనిది. అంతా బాగానే వుంది గాని ఏదో ఒక కళలో పేరు ప్రఖ్యాతులు మూటగట్టుకోవాలనే ప్రగాఢమైన కోరిక ఈ మధ్యనే మనసులో ప్రవేశించింది. అరవైనాలుగు కళల్లో దొంగతనమొకటి. ఆల్‌రెడీ అది ఎలాగూ హాబీగానే ఉంది. అది హాబిట్‌గా మారితే ఉన్న ఉద్యోగం హుళక్కై పోతుంది. అర్ధాంగి అనాథైపోతుంది. పిల్లలు 'పాపిష్టి పిల్లల మండీ' అనిపాడుతూ వీధుల్లో అడుక్కుంటూంటే తానేమో జైల్లో చిప్పకూడు తింటుండాలి. కాబట్టి అది మనకు వర్కౌట్ కాదు. దాన్ని అలవాటు చేసుకోకూడదు అనుకున్నాడు. మరేం చెయ్యాలి? మిగిలిన అరవైమూడు కళల్లో లలిత కళలు కూడా ఒకటి కాబట్టి వీటిల్లో ఏదో ఒకదాన్ని సెలెక్ట్ చేసుకోవాలి అనుకున్నాడు పాపారావు.

అలా అనుకోగానే సంగీతం నేర్చుకుంటే ఎలా ఉంటుందని ఆలోచనొచ్చింది. నిజంగా సంగీతం నేర్చుకుంటే ఏ బాల సుబ్రహ్మణ్యంలాగానో, బాలమురళీకృష్ణలాగానో ప్రోగ్రాంలివ్వవచ్చు. అప్పుడు బాగానే ఉంటుంది గానీ...! ...అదంత తేలికా? సంగీతం నేర్పడానికో గురువుండాలి. పైగా తన స్వరమే గార్దభస్వరమని స్నేహితులంటుంటారు. ఆ స్వరంతో సంగీతం పాడితే ఏంబాగుంటుంది. కాబట్టి ఇది కూడా మన ఒంటికి సారీ, కంఠానికి కుదరని పని కాదనుకున్నాడు. ఇక పోతే డాన్స్ నేర్చుకుంటేనో!? ఇది మాత్రం అనుకోగానే వచ్చేస్తుందా? ఇది నేర్పించేందుకూ సమర్థుడైన గురువు ఉండాల్సిందే కదా! అదీగాక, బోలెడంత సాధన కావాలి.

అలా సాధనకోసం నాట్యం చేస్తుంటే ఒకవేళ కర్మకాలి ఏ కాలో చెయ్యో కలుక్కుమంటే? వామ్మో! ఇదో పెద్ద న్యూసెన్స్. కాబట్టిదీ మనకు పడదనుకున్నాడు.

మరైతే ఏం నేర్చుకోవాలి...? పోనీడ్రాయింగైతే...? చిన్నప్పుడు సైన్సులో బొమ్మలు రాని కారణంగా అత్తె సరు మార్కుల్తో సరి పెట్టు కోవాల్సి వచ్చింది. మరిప్పుడు మాత్రం బొమ్మలు వెయ్యడం ఎలా వస్తుంది. కాబట్టి ఇదీ కుదరదు. ఇహ మిగిలింది సాహిత్యం. చిన్నప్పుడు తను క్లాసులో గడగడా పద్యాలు అప్పగిస్తూంటే తెలుగు మాస్టారు 'పొట్టి వాడివైనా గట్టి వాడివిరా!' అని తెగమెచ్చుకునే వాడు. నిజమే కానీ ఇప్పటికిప్పుడు పద్యాలు రాయడం ఎలా అనుకున్నాడు. తనకు చిన్నప్పుడు హైస్కూల్లో తెలుగు చెప్పిన మాస్టారు గుర్తు కొచ్చారు. అందులోనూ ఆయన మొన్నీమధ్య రోడ్డుమీద కనిపించారు కూడా. తానే గుర్తుపట్టి పలకరించి నమస్కరించినప్పుడే ఆయన ఎంతగానో సంబరపడిపోయారు. తానిక్కడే ఉంటున్నట్టు ఇంటి అడ్రెస్ కూడా ఇచ్చి నీకు వీలున్నప్పుడు రమ్మనమని కూడా చెప్పారు.

కాబట్టి వెంటనే ఆయన దగ్గరకు వెళ్లి పద్యాలు రాసేందుకు కావలసిన చంధస్సు నేర్చుకుంటే సరి అనుకున్నాడు. అప్పుడు పద్యాలు రాయడం చాలా ఈజీ అయిపోతుంది కూడా అనుకున్నాడు. అలా అనుకోవడమేమిటి వెంటనే తెలుగు మాస్టారింటికి పరుగెత్తాడు పాపారావు. మాస్టారిల్లు చేరగానే సగం పద్యం రాసేసినంత ఆనందించాడు పాపారావు. ఈ సంతోషం, కంగారులో ఆయన ఇంటి గడప తగిలి బొక్కా బోర్లా పడ్డాడు. సరిగ్గా ఇతను పడ్డప్పుడే లోపల్నించి హాల్లోకి వస్తున్నారు మాస్టారు. అలా పడ్డందుకు బాధపడ్డా మాస్టారు కనిపించగానే ఆ బాధంతా ఎగిరిపోయింది. అయినా తాను పడ్డాననే ఫీలింగు మాస్టారుకు అనిపించకుండా ఆయన పాదాలకు నమస్కరించేందుకే కిందపడ్డట్టు అనుకునేలా అలా కింద బోర్లా పడుకునే "నమస్కారం మాష్టారు!" అనేశాడు. అప్పుడే లోపల్నించి వచ్చిన మాస్టారు కిందపడ్డవాణ్ని చూసి ఎవరా అనుకుంటూ ఆశ్చర్యపోయారు కానీ నమస్కారమన్న గొంతువిని ఎవరైందీ గుర్తించారాయన.

"ఏరా బడవా! నన్ను కూడా కింద పడేస్తావా ఏమిటి?" అంటూ కొద్దిగా దూరం జరిగి "ఇదిగో ఏమేవ్! నా గదిలో మూల బెత్తం ఉంటుంది ఇలా పట్రా!" అని అరిచాడు మాస్టారు. కాసేపటికి బెత్తం తెచ్చి పడక్కుర్చీలో కూచుంటున్న మాస్టారు కందించిందాయన భార్య. రిటైరైనా మాస్టార్‌కి ఇంకా పిల్లల్ని కొట్టే బుద్ధి పోలేదు కాబోలనుకున్నాడు పాపారావు. పోనిలే ఎలాగైనా తాను చంధస్సు నేర్చుకోవాలి కాబట్టి ఈయనేం చేసినా పడాల్సిందే అనుకుంటూ "కొట్టండి మాస్టారూ!" అంటూ ముందుకెళ్లి నుంచున్నాడు. కొత్తగా పదవి చేపట్టిన నాయకుడిలా పైకి లేచిన బెత్తం, ఎన్నికల వాగ్దానంలా గాల్లో ఆగిపోయింది. "ఏడిశావు అరవండ్రేళ్ల వయసులో ఇరవయేళ్ల కుర్రాడిలా ఉన్నారు అనుకున్నాడు పాపారావు

మాస్టార్ని చూస్తూ. "మాస్టారూ! బెత్తం తెచ్చినావిడ మీ తల్లి గారు కదండీ!" అన్నాడు కరెక్ట్‌గా ఊహించాననుకుంటూ. తల్లి కాదురా వెధవా.... పెళ్లాం! రోజూ యోగాభ్యాసం చేస్తూ నేనిలాగైనాను. ఆవిడలాగే ఉండి పోయింది. ఏం చెయ్యను. ఎంత చెప్పినా యోగా చేసిచావదు మరి!" అన్నారు మాస్టారు. ఇలా అంటున్నప్పుడు తన్ని తాను చూసుకుని మురిసిపోయారు మాస్టారు. ఆవిడ మాత్రం మొగుడన్న మాటలకు మూతి మూడు వంకర్లు తిప్పుతూ "సర్లెండి సంబరం. అవునూ! మీరలా బెత్తం పైకెత్తి దించేశారెందుకూ?" అడిగింది. "అదా! అప్పటి సంఘటన గుర్తొచ్చి భయమేసిందే బాబూ!" అన్నారు మాస్టారు.

"ఏ సంఘటన సార్?" బొటనవేలు నోట్లో పెట్టుకుని చప్పరిస్తూన్నట్టుగా చేస్తూ అడిగాడు పాపారావు. "అదే! ఐదో తరగతిలో నువ్వోసారి నా బెత్తం దెబ్బతిని లాగు తడిపేసుకున్నావు కదా! అదే గుర్తొచ్చింది. మళ్లీ ఇప్పుడేమవుతుందోననీ" ముక్కుపట్టు కున్నారాయన. అందుకు పెద్దగా నవ్వుతూ "మీరు భలే వారు సార్! ఇంకా అలాంటి పన్లు చేస్తానా ఏమిటి?" అన్నాడు. పాపారావు అలా అనగానే వచ్చే నవ్వును ఆపుకుంటూ లోపలికెళ్లంది మాస్టారు భార్య. "అదంతా సరే గానీ, ఇప్పటికిప్పుడు నేనెందుకు గుర్తొచ్చానురా నీకు?" అడిగారు సంశయంగా మాస్టారు. అమ్మయ్యా అనుకుంటూ తానొచ్చిన పని చెప్పేసాడు పాపారావు. "పద్యాలెలా రాయాలో నేర్చుకుందామని" నసిగాడు. అప్పుడు వ్యాకరణమంటేనే వణికిపోయే వాడివిగా! సర్లే! ఏ పద్యం రాస్తావో చెప్పు. ఆ పద్యలక్షణాన్నే నేర్పిస్తా" అన్నారాయన. కాస్సేపు ఆలోచిస్తున్నట్టుగా బుర్ర గోక్కుని "తాటిగీత సార్" అన్నాడు.

గుండాగినంత పనైంది మాస్టారుకు. "తాటి చెట్లు గీకితే తాటిగీత, ఈత చెట్లను గీకితే ఈతకల్లు వస్తుంది కానీ, పద్యం రాదు. తాటి గీతేమిటరా బాబూ" అన్నాడు. "అదే సార్! అదే...సంగీత పద్యం సార్" "సంగీత పద్యమంటూ ఉండదు రా బాబూ!" అనేసి ఓరి నీ తెలివి తెల్లారినట్టే ఉంది కానీ, తేటగీతికొచ్చిన తిప్పలా ఇది" అని పడిపడీ నవ్వారు మాస్టారు. "ఆ...అదే సార్! అదే అదే!" ఊపిరి పీల్చుకున్నాడు పాపారావు. ఇంద్ర, సూర్యగణాల గురించి చెప్పి పద్యలక్షణం చెప్పాడు మాస్టారు. ఆ గణాల గుణాలు తెలీక గుటకలు వేశాడు శిష్యుడు. గురు, లఘువులేమిటో, ఆవంతైనా అర్థం కాలేదు పాపారావుకి. అయినా అర్థమైనట్టు ఫోజిచ్చి "సర్లే మాస్టారూ! ఇది చాలు గాని కంది గురించి చెప్పం" దన్నాడు. కాలుజారి నీళ్లులేని బావిలో పడ్డట్టనిపించి "ఏమిటీ కంది గురించి చెప్పాలా? కందిపప్పా, కందిపచ్చడా?" "ఆ...ఊహూ...అది కాద్సార్!" అంటూ జుట్టు పీక్కున్నాడు. అప్పుడు గుర్తొచ్చిందదేమిటో. "అదే సార్ కందపద్యం" అన్నాడు.

"కంద కొచ్చిన అందమా అది" అని నవ్వుతూ దాని లక్షణాల్ని చెప్పారు మాస్టారు. ఎంత శ్రద్ధగా వింటున్నా మాస్టారు చెప్పిందేదీ బుర్రకెక్కినట్టు లేదు గానీ అంతా గందరగోళంగా ఉంది పాపారావుకి. అందుకే "మాస్టారూ! ఎందుకొచ్చిన తిప్పలు గానీ, ఈ గణాలూ, మాత్రలు, యతులతో నా మతినెందుకు పోగొడతారు గానీ, ఇవేవీ లేకుండా పద్యాలు రాయలేమో చెప్పండి!" అంటూ ఏడవలేక నవ్వేశాడు.

నేను, ముందే చెప్పానా బడుద్ధాయ్.! సరేలే! వచన కవిత్వం హాయిగా రాసుకోవచ్చు. ఇందుకోసం నలుగురైదుగురి వచన కవితలు జాగ్రత్తగా చదివితే నీకే అర్థమైపోతుంది" అన్నారు పడుక్కుర్చీ వెనక్కు జారగిలపడుతూ. "ఇది బాగుంది సార్! కాయితం - కలం ఉంటే చాలు. కడుపులో చల్ల కదలకుండా కవితలు గీకిపడెయ్యొచ్చు. ఎక్కడా ప్రచురితం కాకపోయినా డైరెక్టుగా పుస్తకం వేసేసుకోవచ్చు. కవి సమ్మేళనాల్లో సన్మానాలు కొట్టేయొచ్చు. బోలెడంత ప్రచారం పేపర్లో పేరు మోగిపోతుంది" అని మాస్టారుకు థాంక్స్ చెప్పేసి ఇంటికెళ్ళిపోయాడు. వెడుతూ వెడుతూ దార్లో అరడజను వచన కవితా సంపుటాలు కొనేశాడు. వాటిని ఒక్క రోజులో ఆసాంతం చదివి పారేశాడు.

వెంటనే తెల్లకాయితాల కట్ట, రీఫిల్స్ పాకెట్ కొనేశాడు. వీటిని కొనేటప్పుడు "ఇన్ని కాయితాలెందుకుసార్? కొంపదీసి కవిత్వమేమన్నా రాస్తున్నారా ఏమిటి?" షాపు వాడడిగాడు. "కొంప ముంచడమెందుకూ? కొంపలోనే కూచుని కవితలు రాసి పారేస్తా. అదేమన్నా బ్రహ్మ విద్యా?" అంటూ స్టైల్‌గా గల్లా ఎగరేశాడు. షాపువాడు ఆశ్చర్యంగా కిందినుంచి మీద్దాకా చూశాడు. ఘనకార్యం సాధించబోతున్నానని నవ్వుకుంటూ పురోహితుని దగ్గరకు వెళ్లి నూట పదహార్లు సమర్పించి కవితలు రాసేందుకు ముహూర్తం పెట్టించుకున్నాడు. ఇష్టదైవానికి ఆదరబాదరాగా పూజలు చేసేసి కాయితం - కలం పట్టాడు. కవిత్వమనే లలితకళకు టేబుల్, రైటింగ్ ప్యాడ్‌లు ఆలంబనగదా అన్పించింది. అప్పటి కప్పుడే ఫర్నిచర్ షాపులో పద్దురాయించి మోడ్రన్ టేబుల్, డెకోలాంప్యాడు, మూవింగ్ ఛైయిర్‌లు కొనుక్కొచ్చాడు. అవన్నీ తన గదిలో సర్ది 'ఎలాగుంది', అన్నట్టుగా భార్యవైపు చూశాడు. "అబ్బ! ఇంటికి కొత్త కళొచ్చిందండీ!" కాటుక కళ్ళను కమ్మగా తిప్పుతూ, తన్నుకొస్తున్న తుమ్మును అదిమిపెట్టి ఓ ముద్దు వడ్డించింది భార్య. ఆ ముద్దుకి గాల్లో తేలిపోతున్నట్టని పించింది పాపారావుకు. వందపుస్తకాలు చదివిన వ్యక్తి నూట ఒకటో పుస్తక రచయికవ తాడని ఒక పుస్తకం పీఠికలో చదివాడు. ఐనప్పుడు రెండొందలదాకా కవితలు చదివిన నేను ఒక్క కవిత ఈజీగా రాయగలననే ఆత్మవిశ్వాసం పాపారావులో గుమ్మడికాయంతైంది.

దర్జాగా కుర్చీలో కూచోగానే అర్ధాంగి ఫిల్టర్ కాఫీ అందించింది. హాయిగా దాన్ని సిప్ చేస్తూ... అరగంటలో అరఠావు కవిత రాసేశాడు. ఆఫీసు లంచవర్లో అటెండర్లకు స్వీటు తినిపించి మరీ కవిత వినిపించాడు. విన్నవారు ఎటోచూస్తూ భవిష్యత్తు బంగారమన్నారు. విననివారు ఓహో! ఆహా!లతో ఊదరగొట్టారు. నెలరోజుల్లో ముచ్చటగా ముప్పై కవితలు. ఫైనలైపోయాయి. ఆలస్యం అమృతం విషం సామెత బుర్రలో బురిడీలు కొట్టి బ్రహ్మాండంగా తన తొలి కవితల పుస్తకాన్ని అచ్చు వేయించేందుకు ఉపక్రమించాడు. ఇందుకోసం పీఠిక రాయమని ప్రముఖ కవి నడిగి కవరు పేజీ లేని పుస్తకాన్నందించాడు. అందులో మొదటి కవిత చదివేసరికే సదరు కవి మహాశయుడికి ముచ్చెమటలు పోసినై.

కవితలోని ఒక వాక్యానికి మరో వాక్యానికి పొంతన లేదు. మరోదాన్ని చదివాడు. కడుపంతా వికారంగా తయారైంది. మూడోది చదవగానే బుర్రలో బొంగరాలు తిరిగాయి. మెదడునరాలు తెగకుండా ముందు జాగ్రత్తగా పుస్తకాన్ని మూసేసి “నాయనా! ఇది అద్భుతమైన కావ్యం దీనికి పీఠిక అవసరం లేదు” అంటూ తిరిగిచ్చేశాడు. దాంతో నా కవితలు మహాకవులస్థాయిలో ఉన్నాయన్న మాట. వాళ్ల పుస్తకాలకే పీఠికలుండవు అనుకుంటూ పాపారావు ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు. అంతే ఇక ఏ క్లాసు ఆర్టిస్ట్ చేతిలో పాపారావు పుస్తకానికి ముఖచిత్రం రూపుదిద్దుకుంది. మల్టీకలర్ కవరుపేజీ అదిరిపోయింది. పాపారావు కవితా సంపుటి సర్వాలంకార శోభితమైన పెళ్ళికూతురులా మురిపిస్తూ విశ్వవేదిక మీదికొచ్చింది. అడిగినంత విరాళం ముట్టజెప్పగానే ఓ అగ్రశ్రేణి సాహితీ సంస్థ పాపారావు పుస్తకావిష్కరణోత్సవానికి పూనుకుంది.

పుస్తక సమీక్ష చెయ్యమని సంస్థ కార్యకర్తలు పలువురు పండితులనడిగారు. అయితే అందుకెవ్వరూ సాహసించలేదు. అయినా కూడా అందరికీ ఆహ్వానాలందాయి. ఆవిష్కరణ సభలో కొలువు దీరిన శ్రోతలు, అతిథులు, కార్యకర్తలకు ముందుగానే తలా రెండు కోవా బిళ్లలు, అరటిపళ్ళు, జీడి పప్పు కలిసిన కారా... కాఫీలిచ్చేశారు. హాలు రసజ్ఞులతో కిటకిటలాడుతోంది. ఎండాకాలం కెమెరా క్లిక్ మంది. వీడియో ధగధగ లాడింది. పత్రికా విలేకరులు పళ్ళల్లో ఇరుకున్న కోవాపేడాలను పుల్లతో కెలుకుతూ వార్త రాసుకుంటున్నారు. మంత్రి సుదీర్ఘోపన్యాసం నీరు కరువైన నదీ ప్రవాహంగా సాగింది. అందులో కూడా పాపారావునో మహాకవిగా చిత్రిస్తూ ఈ పుస్తకానికి నోబుల్ ప్రైజు రావాలని ఆకాక్షించాడు. సభ చప్పట్లతో మార్మోగింది. తనకేదో అర్జంటు పనుందని సన్మానాన్నందుకుని మంత్రి గున్న ఏనుగులా నడుస్తూ వెళ్ళిపోయాడు. మంత్రివెంట అతని బృందమూ నిష్క్రమించింది.

అప్పుడే నోబుల్ ప్రైజొచ్చి ఒడిలో వాలినంత సంతోషమైంది పాపారావుకు. తన గొప్పతనానికి తానే వీపుచరుచుకున్నాడు. వ్యాఖ్యాతను నీరసం ఆవహించిందేమో, మత్తుగా కుర్చీ వెనక్కు ఒరిగాడు. అతని పక్కనున్న సభాధ్యక్షుడు లేచి "ఇంత మహాకావ్యావిష్కరణకు హాజరైన వాళ్లమంతా ధన్యజీవులం. ఇప్పుడు కవిరాజు పాపారావుగారు స్వీయకవితా గానం చేస్తారు" ప్రకటించి వ్యాఖ్యాత భుజమ్మీద చరుస్తూ కూల బడ్డాడు. కోపంగా పళ్ళు నూరుతూ వ్యాఖ్యాత తన మానాన తాను మత్తులోకి జారుకున్నాడు. "సభకు హాజరైన వారికందరికీ నా నవకానుక..." తో మొదలుపెట్టి చిన్నపాటి ఉపన్యాసం దంచేసి కవితాగానం మొదలుపెట్టాడు. పుస్తకం తెరిచి కవితా పారవశ్యంలో కొట్టుకుపోతూ శ్రోతల సంగతి పట్టించుకోకుండా చదివేస్తూనే ఉన్నాడు. ఒళ్ళు విరుపులు, మోచేతుల పొడుపులతో సభ సగం ఖాళీ అయింది.

అయినా ఇంకా ఆ కవితాధార ఆగలేదు. రాత్రి భోజనం పెట్టిస్తామన్నా ఉండడం మా వల్ల కాదంటూ సభ మొత్తం ఎడారిగా మారి పోయింది. బయటికి వెళ్లే వాళ్లందరూ పాపారావుని అనే మాటలతో దాదాపు ఒక వంద పుస్తకాలు రాయొచ్చు. సభ ఖాళీ అయినా కవితాగానం మాత్రం ఇంకా ఆగలేదు. దాంతో ఉరుములేని మెరుపులా "ఇంక ఆపెయ్యండా కవితాగానం" అంటూ పెద్దగా అరుపు వినిపించింది. ఆ అరుపునకు పులిని చూసిన పిల్లిలా జడుసుకున్న పాపారావు ఈ లోకంలో కొచ్చాడు. ఎదురుగుండా ఎవ్వరూ లేరు. కుర్చీలన్నీ ఖాళీగానే కనిపిస్తున్నాయి. అయితే వేదిక మీద మాత్రం సభాధ్యక్షుడు, వ్యాఖ్యాత ఒకరిమీద ఒకరు పడి కాళ్ళూ చేతులు కొట్టుకుంటున్నారు. ఇంతలో వెనకనుంచి ఒక ధృడకాయుడు చేతిలో దుడ్డుకర్ర, కళ్ళల్లో కోపంతో మీదికొస్తూ కనిపించాడు. వాణ్ని చూడగానే పాపారావు గుండె పీచుపీచుమంది. చేతిలోని పుస్తకం జారి కింద పడింది. పొట్టికాళ్ళను, పొడగాటి చేతుల్ని దగ్గరగా మలుస్తూ శక్తినంతా కూడగట్టుకున్నాడు. గట్టిగా ఊపిరి పీల్చుకుని బంతిలా ఎగిరాడు. లాంగ్ జంప్‌లో హైజంప్ మెళకువలుపయోగించి వేదిక మీదినుంచి దూకేశాడు. గీరుకుపోయి రక్తమోడుతున్న మోకాళ్ళు, మోచేతుల్ని తడుముకోకుండానే పరుగోపరుగు. వెనక్కి చూస్తే ఒట్టు.

*(ఆంధ్రప్రభ - ఆదివారం 23-1-2011)*